క్లుప్తంగా

భక్తాంజనేయ దేవస్థానానికి మంచినీటి సౌకర్యం

సత్తెనపల్లి: వేసవిని దృష్టిలో ఉంచుకొని భక్తుల సౌకర్యార్థం పట్టణంలోని మహారాష్ట్ర వీధిలో వేంచేసియున్న భక్తాంజనేయ స్వామి దేవస్థానానికి మంచినీటి సౌకర్యం కల్పించేందుకు గరే చంద్రశేఖర్ మారుతి శ్రీనివాసు నాగేశ్వరి దంపతులు ముందుకు వచ్చారు. దేవస్థానంలో మంచినీటి బోరు, మోటారు, వాటర్ ట్యాంకర్ తదితర వాటికి రూ.70 వేలు వెచ్చించారు. ఈ సందర్భంగా శనివారం భక్తాంజనేయ స్వామి దేవస్థానం కమిటీ, చత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు దాత దంపతులను పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, చత్రపతి శివాజీ యూత్ కమిటీ సభ్యులు ఉన్నారు.

నేడు ఆర్‌ఎస్‌ఎస్ వార్షికోత్సవం

సత్తెనపల్లి: రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ సత్తెనపల్లి మారుతి శాఖ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు పట్టణంలోని ఫిరోజ్ మందిర్‌లో జరుగుతుందని శాఖ కార్యవాహ చంద్రశేఖర్ శనివారం తెలిపారు. ఈ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా త్రిశక్తి దుర్గాపీఠం పీఠాధిపతులు వి.హనుమత్ స్వామి, ముఖ్య వక్తగా గుంటూరు విభాగం కార్యవాహ జిగురు ప్రతాప సింహ శాస్త్రి హాజరవుతారన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ

క్రోసూరు: క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రభుత్వం నిర్వహిస్తున్న మూడు సంవత్సరాల ఇంజినీరింగ్ కోర్సులు, నాన్ ఇంజినీరింగ్ కోర్సుల ఎంట్రన్స్ పరీక్షకు(పాలిసెట్)సోమవారం నుంచి ఉచితంగా కోచింగ్ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్స్‌పాల్ బీవీ రమాదేవి శనివారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగుతులు జరుగుతాయన్నారు. ఉచితంగా స్టడీ మెటీరియల్, నమూనా పరీక్షల నిర్వహణ జరుగుతుందన్నారు. ఎంట్రన్స్ పరీక్షకు ఏప్రిల్ 5 వతేదీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కళాశాలలో ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. పదవతరగతి పాసైన వారు, పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. పాలిటెక్నిక్ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు. క్రోసూరు, చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ రమాదేవి కోరారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశానికి గడువు పెంపు

ఏప్రిల్ 6వ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం

క్రోసూరు: ఏపీ మోడల్‌స్కూల్‌లో ఆరవ తరగతి ప్రవేశపరీక్ష కోసం దరఖాస్తు స్వీకరణ తేదీని ఏప్రిల్ 6వ తేదీవరకు పెంచినట్లు క్రోసూరు ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ మేరీసుజన్ శనివారం తెలిపారు. ఐదవ తరగతి పాసైన విద్యార్థులు, తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చునని కోరారు.

క్షతగాత్రుడికి రూ. 20 వేలు ఆర్థిక సాయం



సత్తెనపల్లి: క్షతగాత్రుడి ఆపరేషన్ ఖర్చులకు రూ. 20 వేలు ఆర్యవైశ్య సంఘాలు శనివారం సాయం అందించాయి. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 13వ వార్డుకు చెందిన పేర్ల అనిల్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలయ్యాడు. వైద్యశాలలో చేర్పించగా ఆపరేషన్ చేయాలని వైద్యులు నిర్ణయించడంతో ఆర్థికసాయం అందించాల్సిందిగా ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణను కోరారు. ఆర్య వైశ్య యువజన సంఘం అధ్యక్షుడు చిల్లంచర్ల కల్యాణ్ సహాయంతో రూ. 20 వేలు సేకరించి, బాధితుడికి అందజేశారు. వాసవి సేవాదళ్ అధ్యక్షుడు హరికుమార్, ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీ పొత్తూరి హరీష్, ట్రెజరర్ లగువరపు రమేష్ తదితరులు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

అమరావతి: స్థానిక అమరేశ్వర ఘాట్ సమీపంలో కృష్ణానదిలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం అమరేశ్వరాఘాట్ వద్ద గల పంప్ హౌస్ సమీపంలో సుమారు 35 సంవత్సాల వయసు గల వ్యక్తి మృతదేహన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అమరావతి పోలీసులు మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌కు తరలించారు. ఈసందర్భంగా సీఐ వి.వి. బ్రహ్మం మాట్లాడుతూ మృతుడు పసుపురంగు గీతలు కల్గిన టీ షర్టు, ఆర్‌ఆర్ కంపెనీకి చెందిన నలుపు రంగు షార్ట్ ధరించి ఉన్నాడన్నారు. గుర్తించిన వారు 94407 96217, 9440792266 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.



టీడీపీకి రాజకీయ సమాధి తప్పదు

- దళితులను కించపరిస్తే ఖబడ్దార్ చంద్రబాబు
- చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా, నిరసన ప్రదర్శన



సత్తెనపల్లిలో నిరసన ప్రదర్శన చేస్తున్న దళిత సంఘాల నాయకులు

సత్తెనపల్లి: పెత్తందారుల బుద్ధి పోగొట్టుకోకుండా దళిత సామాజిక వర్గాలను కించపరుస్తూ, అవహేళన చేస్తూ మాట్లాడుతున్న చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి రాజకీయ సమాధి తప్పదంటూ దళిత సంఘాల నేతలు తీవ్రంగా హెచ్చరించారు. చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా దళిత సంఘాల నేతలు, సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలక జైపాల్ సంయుక్త ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని ప్రధాన రహదారిపై ఆగ్రహంతో శనివారం ఆందోళన, నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై రాస్తారోకో నిర్వహించి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యావంతుడైన దళిత బిడ్డ, టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ సీపీ తరఫున సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు టికెట్ ఇవ్వడంపై మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు కించపరుస్తూ మాట్లాడారన్నారు. జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, సాధారణ పౌరులకు కూడా టికెట్లు ఇచ్చి రాజ్యాధికారానికి దూరంగా ఉన్న వర్గాలకు రాజకీయ ప్రోత్సాహం ఇస్తుంటే.. దిగజారుడు వ్యాఖ్యలు చేస్తుండటం దారుణమన్నారు. గతంలోనూ ఇలాంటి వ్యాఖ్యల చేసి దళితుల ఆగ్రహానికి గురయ్యారని, ఇక మీదట దళిత వర్గాలను కించపరిచేలా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. భవిష్యత్తులో పేద వర్గాలను తూలనాడితే 'ఖబర్దార్.. చంద్రబాబు' అంటూ రానున్న ఎన్నికల్లో తప్పకుండా బుద్ధి చెబుతామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు జూపల్లి పాల్, గుజ్జర్లపూడి కృపావరం, నందిగం యల్లమంద, చిలుకా నాగేశ్వరరావు, పెద్దింటి నాగేశ్వరరావు, కాశిమాల మార్క్, కూచిపూడి సైమస్, కాటుమాల డేవిడ్, జడా ప్రసాద్, కాటుమాల ప్రభాకర్, పాటిబండ్ల రామారావు, బూదాటి సీతారాములు, గంజిమాల రాజా, చిలుకా సాయి కుమార్, చింతపల్లి కిరణ్‌కింగ్, గొల్లపల్లి నాగేశ్వర రావు, చిలుకా రమణయ్య, గొల్లపల్లి రాము, కాకుమాను రవి, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

ఇఫ్తార్ విందులో భాగస్వాములు కావాలి

- ఏప్రిల్ 3న సత్తెనపల్లి ఈద్గాలో భారీ ఇఫ్తార్ విందు
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- ముస్లిం సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులతో సన్నాహక సమావేశం

సత్తెనపల్లి: ప్రపంచవ్యాప్తంగా ఉన్న ముస్లిం సోదరులకు రంజాన్ నెల పవిత్రమైన మాసమని, రంజాన్‌ను పురస్కరించుకొని అల్లాకు ఆధ్యాత్మికంగా దగ్గరగా ఉండేందుకు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్ష చేస్తున్నవారికి, ఇతర ముస్లింలకు ఏప్రిల్ 3వ తేదీన ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో ముస్లింసోదరులు భాగస్వాములై విజయవంతం చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముస్లిం మైనారిటీ నాయకులతో కలిసి ఇఫ్తార్ విందు కార్యక్రమంపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఏప్రిల్ 3వ తేదీన జరిగే ఇఫ్తార్ విందుకు తీసుకోవలసిన కార్యాచరణపై చర్చించారు. పట్టణంలోని ఈద్గా వద్ద సాయంత్రం జరిగే ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు, జన సమీకరణ వంటి అంశాలను చర్చించారు. నాయకులందరూ సమష్టి గా, బాధ్యతాయుతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షేక్ నాగుల్‌బాషా, 5వ వార్డు కౌన్సిలర్ డాక్టర్ సయ్యద్ సలీం, షేక్ మహ్మద్ గని, ముస్లిం మత పెద్దలు, మున్సిపల్ నాయకులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

కోనేటి రాయుడికి నీరాజనాలు



దేవరంపాడు కొండకు పోటెత్తిన భక్తులు

గోవింద నామస్మరణతో మారుమోగిన ఆలయం

రాజుపాలెం: పల్నాడు తిరుపతిగా పేరుగాంచిన నేతి వెంకన్న స్వామి మూడవ శనివారం తిరుణాళ్లకు దేవరంపాడు కొండకు భక్తులు పోటెత్తారు. సమీప ప్రాంతాల నుంచే గాక, సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు దేవరంపాడు కొండకు విచ్చేసి స్వామి వారిని దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. గోవింద నామ స్మరణతో కొండ మారుమోగింది. కోనేటి రాయుడికి కోటి దండాలు అంటూ భక్తులు నీరాజనాలు పలికారు. భక్తులు స్వామివారికి పొంగళ్లు చేసి, నెయ్యి, బెల్లం, పప్పు వగైరాలు సమర్పించారు. పశుసంపదను కాపాడాలని స్వామివారికి నెయ్యిని సమర్పించి మొక్కుకున్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తిరుణాళ్లలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆయన వెంట గుంటూరు మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, ఆలయ కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, ఈఓ గుర్రం శ్రీనివాసరెడ్డి, సర్పంచి పత్తిపాటి దీనమ్మ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు



బయ్యవరం(క్రోసూరు): సార్వత్రికల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని, ఎటువంటి దౌర్జన్యాలు, అల్లర్లు, ఘర్షణలకు అవకాశం ఇవ్వరాదని రాజకీయ పార్టీలను సీఐ మంగారావు కోరారు. మండలంలోని బయ్యవరం గ్రామంలో బీఎస్ఎఫ్ బలగాలతో పోలీసు కవాతును శనివారం నిర్వహించారు. ఎస్ఐ ఎం.షఫీ, సిబ్బంది పాల్గొన్నారు.

ముప్పాళ్ళ: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సత్తెనపల్లి రూరల్ సీఐ రాంబాబు అన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ, చాగంటివారిపాలెం గ్రామాల్లో అదనపు కేంద్ర బలగాలతో శనివారం పోలీసు కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. కవాతులో ముప్పాళ్ల ఎస్ఐ హజరతయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ప్రసన్నాంజనేయ స్వామి జయంతి



రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరంలో ప్రసన్నాంజనేయస్వామి 95వ జయంతి మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారికి సామూహిక లక్ష తమలపాకుల పూజలు, సిందూర పూజలను పలువురు దంపతులు నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు శ్రీనివాసుల హనుమంత్ దీక్షితులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రథంపై స్వామివారిని గ్రామ పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజుపాలెం నవోదయ పాఠశాలకు చెందిన విద్యార్థుల కోలాటం చూపరులను ఆకట్టుకుంది.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

నకరికల్లు: విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించి అపరాధ రుసుం నుంచి తప్పించుకోవచ్చని విద్యుత్‌శాఖ ఏఈ నాగవెంకట సురేష్ శనివారం తెలిపారు. విద్యుత్ బిల్లులలో ఇచ్చిన గడువు తేదీలలోపు బిల్లులు చెల్లించినట్లయితే వినియోగదారునికి భారం తగ్గుతుందని అన్నారు. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బిల్లులు సేకరించే సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఘనంగా రామాలయ ప్రతిష్టా మహోత్సవం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామంలో రామాలయ ప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ స్వామివారి మూర్తులను, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి అంబటి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్

మండలంలోని దమ్మాలపాడు గ్రామంలోని రామాలయ ప్రతిష్టా మహోత్సవంలో రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్, గుంటూరు మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణలు పాల్గొని, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి, శిరిగిరి గోపాలరావు, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి, కళ్లం శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు, అనిల్‌కుమార్ యాదవ్

జగనన్నకు అండగా నిలుద్దాం

- నంబూరు వసంతకుమారి
- జూపూడిలో ఇంటింటి ప్రచారం

అమరావతి: రాష్ట్రంలో గత ఐదేళ్లలో పేద బడుగు, బలహీనవర్గాల వారందరికీ సమన్యాయం జరిగిందని పేదలు మరింతగా అభివృద్ధి చెందాలంటే జగనన్నకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు నంబూరు వసంతకుమారి అన్నారు. శనివారం మండల పరిధిలోని జూపూడిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్న పథకాల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ది చేకూరిందన్నారు. పేదల కష్టాలను, వారి సమస్యల పరిష్కారానికి వైఎస్సార్ సీపీ కట్టుబడి ఉందన్నారు, మహిళలు, రైతులు, విద్యార్థులు, కార్మికులు, వృద్ధులు, దివ్యాంగులు ఇలా అన్ని వర్గాలవారికి మంచి చేసిన జగనన్నకు మరొక్కసారి అండగా నిలవాలని కోరారు. ఈసందర్భంగా జూపూడి ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, నాయకులు నంబూరు బాబురావు, నాగరాజు, అన్నపాములు, ఆనందకుమారి, పున్నారావు, జక్రయ్య, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



జూపూడిలో ఇంటింటి ప్రచారంలో నంబూరు వసంతకుమారి

అనుమతులు ఉంటేనే కరపత్రాలు ముద్రించాలి

- సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ
- ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో సమావేశం

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకొని రాజకీయ పార్టీల నాయకులు ముద్రించమని కోరే కరపత్రాలకు సత్తెనపల్లి ఆర్డీఓ, నియోజకవర్గ ఆర్ఓ అనుమతి ఉంటేనే ఎన్నికల కరపత్రాలు ముద్రించాలని సత్తెనపల్లి ఆర్డీఓ, నియోజకవర్గ ఆర్ఓ వి.మురళీకృష్ణ స్పష్టం చేశారు. పట్టణంలోని తన కార్యాలయంలో శనివారం ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్డీఓ మురళీకృష్ణ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులు ముద్రించమని కోరే కరపత్రాలకు సంబంధించి ఏ వ్యక్తి ముద్రించమని కోరారు? ఎన్ని ముద్రించమని ఆర్డర్ ఇచ్చారు? దానికి నియోజకవర్గ ఆర్వో అనుమతి ఉందా లేదా అనేది ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు పరిశీలించుకుని కరపత్రాలను ముద్రించాలన్నారు. ఇది ఎన్నికల వ్యయం కిందకు వస్తుందన్నారు. అనుమతులు లేకుండా ముద్రించినట్లయితే ఎన్నికల సంఘం నిబంధన మేరకు చర్యలు ఉంటాయన్నారు. సార్వత్రిక ఎన్నికల నిబంధనలను ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులకు కూడా వర్తించడం జరుగుతుందన్నారు. సమావేశంలో పలు ప్రింటింగ్ ప్రెస్‌ల నిర్వాహకులు ఉన్నారు.

సత్తెనపల్లిలో 'రన్ ఫర్ జీసస్'

సత్తెనపల్లి: ఏసుక్రీస్తు మరణ పునరుత్థానాన్ని లోకానికి చాటుతూ సత్తెనపల్లి నియోజకవర్గ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్‌వారి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని లూథరన్ చర్చి వద్ద రెవ.స్వరూప్ కుమార్ ప్రార్థనతో ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని రాజుల కాలనీ, పాత బస్టాండ్, మున్సిపల్ కార్యాలయం, గడియార స్తంభం, క్రిస్టియన్ పేట మీదుగా సాగి తిరిగి లూథరన్ చర్చి వద్ద ముగిసింది. షాలోమ్ చర్చ్, హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చ్, ఫుల్ గాస్పల్ చర్చ్, గార్లపాడు కల్వరి బాప్టిస్ట్ చర్చ్, ఇతర సంఘాల విశ్వాసులు, పాస్టర్లు ర్యాలీలో భాగస్వాములు అయ్యారు. కార్యక్రమంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఫౌండర్ జి.సుధీర్ కుమార్, ప్రెసిడెంట్ ఐ.డేవిడ్‌రాజ్, సెక్రటరీ బీఎస్ రావు, వైస్ ప్రెసిడెంట్ కె.కోటేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ యు.ప్రభాకర్‌రావు, ట్రెజరర్ ఎస్.సత్యానందం, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని ప్రధాన రహదారిలో సాగుతున్న రన్ ఫర్ జీసస్ ర్యాలీ

ఘనంగా ప్రసన్నాంజనేయ ప్రతిష్టా మహోత్సవం

మాచర్ల: పట్టణంలోని 31వ వార్డులోని వినాయకు నిగుట్ట కాలనీలో ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట శనివారం నిర్వహించారు. ఉదయం నుంచి ధ్వజస్తంభ ఏర్పాటు, ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేసి, ధ్వజస్తంభ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం వద్ద వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి(పీవీఆర్) ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజస్తంభం వద్ద పూజా కార్యక్రమం నిర్వహించి అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన ఏసోబు, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, పట్టణ అధ్యక్షులు పోలా శ్రీను, కౌన్సిలర్ దస్తగిరి, ఆత్మకూరి పూర్ణచంద్రరావు, వార్డుకు చెందిన పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహానికి పూజలు చేస్తున్న పీవీఆర్

బీసీ సెల్ మండల అధ్యక్షుడికి సత్కారం

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన పొట్లూరి శ్రీనివాసరావును రజక సంఘ నాయకులు శనివారం పూల మాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. తన పై నమ్మకంతో తనను బీసీ సెల్ మండల అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన మంత్రి అంబటి రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ సలహా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కరరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. రజక సంఘ నాయకులు, పట్టణంలోని 30వ వార్డు ఇన్‌చార్జ్ ఉల్లంఘుల ప్రసాద్ బాబు, మండడపు శివసాయి, తదితరులు ఉన్నారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న రజక సంఘ నాయకులు

బీఎస్పీ సత్తెనపల్లి అభ్యర్థిగా నవీన్‌బాబు



సత్తెనపల్లి: బహుజన సమాజ్ పార్టీ సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా పేరుపోగు నవీన్ బాబును బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి ప్రకటించారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయవతి ఆదేశాల మేరకు తిరుపతిలో జరిగిన పార్టీ సమావేశంలో పోటీ చేయనున్న అభ్యర్థుల జాబితాను విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ జాబితాలో సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించారరని నవీన్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీఎస్పీ నియోజకవర్గంలో నిర్ణయాత్మకమైన శక్తిగా మారుతుందన్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బక్క పరంజ్యోతి, పల్నాడు జిల్లా అధ్యక్షుడు బూదాల బాబురావులకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ నాయకులు దేవానంద్, కోటేశ్వరరావు, అంబేడ్కర్, లోకేష్, వందనం, సాయినాథ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



రెంటచింతల: మండలంలోని తుమ్మకోట గ్రామంలో గురజాల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, నర్సరావుపేట డీటీఎఫ్, ఎక్సైజ్ సిబ్బందితో కలిసి సంయుక్తంగా నిర్వహించిన దాడులలో ఓ వ్యక్తి నుంచి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు గురజాల ఎన్ఫోర్స్మెంట్ సీఐ వెంకట రమణ శనివారం తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు. గ్రామానికి చెందిన వి.వెంకట సైదేశ్వరరావు తన నివాసంలో అక్రమంగా మద్యం విక్రయిస్తూ ఉండగా అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి డ్యూటీ పెయిడ్ 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 35, నాన్ డ్యూటీ పెయిడ్ 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు 15, 90 ఎంఎల్ మద్యం బాటిళ్లు 23 స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసి గురజాల కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

మాదలలో సీజీజీబీ శాఖ ప్రారంభం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభోత్సవం శనివారం జరిగింది. కార్యక్రమంలో బ్యాంకు ఆర్ఎం సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొని నూతన శాఖను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 265వ శాఖను ప్రారంభించటం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.22వేల కోట్ల లావాదేవీలు జరిగాయన్నారు. ఖాతాదారులకు బ్యాంకు సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. బ్యాంక్ ఛీఫ్ మేనేజర్ శ్రీనివాసకుమార్, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రావిపాటి బసవయ్య, రిటైర్డ్ హెచ్ఎం వంగా వెంకటేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షుడు మార్పుల వెంకటరెడ్డి, కంచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.